క్లుప్తంగా

రైల్వేస్టేషన్‌లో డీఆర్‌ఎం ఆకస్మిక తనిఖీలు



టీటీఈ రెస్ట్ హౌస్‌లో తనిఖీలు చేస్తున్న డీఆర్‌ఎం లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఉద్యోగులు, సిబ్బంది భద్రత, సంక్షేమం కోసం కృషి చేస్తూ రాత్రి వేళల్లో సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు, పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఆదివారం అర్ధరాత్రి విశాఖ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. టీటీఈ రెస్ట్ హౌస్, బుకింగ్ కార్యాలయంతోపాటు హెరిటేజ్ రిటైరింగ్ రూంలు, స్లీపింగ్ పాడ్స్ వంటి ప్రాంతాల్లో సిబ్బంది వసతులు, ప్రమాణాలను పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో సిబ్బందితో డీఆర్‌ఎం ముఖాముఖి మాట్లాడారు. ఏ సమస్యలున్నా తనకు తెలియజేయాలని, అవసరమైన సూచనలు చేయవచ్చన్నారు. ఆకస్మిక తనిఖీల వల్ల వాస్తవ పరిస్థితులను తెలుసుకునే అవకాశం ఉంటుందని డీఆర్‌ఎం తెలిపారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



తల్లిపాల విశిష్టతను వివరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు

అల్లిపురం: ముర్రుపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ కార్యకర్తలు బాలింతలు, గర్భిణులకు వివరించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం 32వ వార్డు నేరెళ్లకోనేరు అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రసవమైన గంటలోపు బిడ్డకు తల్లిపాలు తాగించడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని, తద్వారా వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఆర్‌టీఎల్ మంగరాజు, నేరెళ్లకోనేరు అంగన్‌వాడీ కార్యకర్త టి.పార్వతి, హెల్పర్ పద్మావతి, ఎంఎస్‌కే వరలక్ష్మి, హైమావతి, ఏఎన్‌ఎంలు సుధ, విజయలక్ష్మి, ప్రభావతి, సుందరి కాంతం, పార్వతి, ఆశ వర్కర్లు సరోజా, నాగలక్ష్మి, కృష్ణవేణి, తల్లులు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నీలాపు వెంకటరమణ

అల్లిపురం: విధులకని వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆరిలోవకు చెందిన నీలాపు వెంకటరమణ జీవీఎంసీ స్వీపర్‌గా డాబాగార్డెన్స్ ప్రాంతంలో పని చేస్తుంటాడు. జూలై 19న విధులకు హాజరయ్యేందుకు డాబాగార్డెన్స్ మహిళా కళాశాల వెనుక వీధిలోకి వెళ్లాడు. ఆ రోజు నుంచి తిరిగి ఇంటికి రాకపోవడంతో అతడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నీలాపు వెంకటరమణ 5 అడుగుల ఎత్తు కలిగి, నలుపు రంగులో ఉంటాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 70934 83898, 94409 04716 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు



చెక్కు అందిస్తున్న దాత సూర్యప్రకాశరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి తగరపువలసకు చెందిన ఉప్పాడ బాల ఆదిత్యరెడ్డి రూ.లక్ష విరాళాన్ని నగదు రూపంలో సింహగిరిపై ఉన్న పీఆర్వో కార్యాలయంలో మంగళవారం అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు ఈవో వి.త్రినాథరావు బాండ్ అందించారు. అలాగే నగరంలోని మహారాణిపేటకు చెందిన కె.సూర్యప్రకాశరావు, శ్రీలక్ష్మి దంపతులు రూ.లక్ష విరాళాన్ని చెక్కురూపంలో పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ విభాగం సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు అధికారులు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు. కార్యక్రమంలో పీఆర్వో అప్పలనాయుడు పాల్గొన్నారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. అప్పన్నకు నిత్యకల్యాణం, గరుడ సేవలో విశేషంగా నిర్వహించారు.

ఘనపతిం

వినాయక చవితి ఉత్సవాలకు సిద్ధమవుతున్న విగ్రహాలు

పర్యావరణ హిత మట్టి ప్రతిమల తయారీలో బిజీగా కళాకారులు

ఇప్పటికే 70 నుంచి 80 శాతం ఆర్డర్లు



పాత పోస్టాఫీస్ వద్ద కళాకారుడి చేతిలో రూపుదిద్దుకుంటున్న గణనాథులు









దాబాగార్డెన్స్: వినాయక చవితి వస్తుందంటే చాలు.. అందరిలో ఉత్సాహం వెల్లివిరుస్తుంది. వీధి వీధిన బొజ్జ గణపయ్యలను పెట్టి ఘనంగా పూజలు చేస్తుంటారు. ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయక చవితి మహోత్సవాలను పురస్కరించుకుని నగరంలో ఇప్పటి నుంచే సందడి నెలకొంది. కళాకారులు వివిధ కళాకృతుల్లో గణపతి ప్రతిరూపాలను తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఉత్సవాల నిర్వాహకులు వారికి కావాల్సిన ఆకృతుల్లో ముందుగానే ఆర్డర్లు ఇచ్చి మరీ విగ్రహాలను తయారు చేయించుకుంటున్నారు. మరో వైపు మట్టి విగ్రహాలనే పూజించాలని పర్యావరణ వేత్తలు ప్రజల్లో అవగాహన కల్పించే పనిలో ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మేము సైతం..

వాతావరణం కలుషితం కాకుండా పర్యావరణ పరిరక్షణకు మేము సైతం అంటున్నారు విగ్రహ తయారీదారులు. కోల్‌కత్తా, ఒడిశా భద్రక్ నుంచి వలస వచ్చిన కొంత మంది కళాకారులు నగరంలోని మధురవాడ(ఎస్‌బీఐ బ్యాంక్ పక్కన), పాతనగరం పాత పోస్టాఫీస్, కంచరపాలెం, ధర్మనగర్, రామ్మూర్తిపంతులుపేట తదితర ప్రాంతాల్లో కేవలం మట్టితో చేసిన విగ్రహాలు మాత్రమే తయారు చేస్తున్నారు. రసాయనాలు లేని సహజ రంగులను మాత్రమే ఉపయోగిస్తూ, భక్తులను ఆకర్షించేలా ప్రతిమల తయారీలో నిమగ్నమయ్యారు. మామూలుగా వినాయక విగ్రహాలను వైట్ సిమెంట్ అచ్చుల్లో వేసి తయారు చేస్తారు. వీరు చేతితోనే వివిధ ఆకారాలతో మట్టి విగ్రహాలను తయారు చేయడం విశేషం.

కార్తీక్ బొమ్మలకు భలే గిరాకీ..

ఒడిశా భద్రక్ కళాకారుడు కార్తీక్ బొమ్మలకు గిరాకీ ఎక్కువగా ఉంటుంది. ఆర్డర్లు బట్టి మూడడుగుల నుంచి 20, 30, 40, 50 అడుగుల పైగా విగ్రహాలను వివిధ రూపాల్లో తయారు చేస్తుంటాడు. నాలుగు దశాబ్దాలుగా విశాఖ నగర ప్రజలకు కార్తీక్ సుపరిచితుడే. పాత పోస్టాఫీస్, మధురవాడ వద్ద విగ్రహాలను తయారు చేస్తుంటాడు. గణపతిని విశ్వేశ్వరుడు.. పరమశివుడు.. పార్వతీ పారమేశ్వరుల తనయుడిగా తీర్చిదిద్దడమే గాక పలు దేవుళ్లు, దేవతా రూపాల్లో వినాయకుడిని తీర్చిదిద్దడంలో దిట్ట. అందుకే కార్తీక్ బొమ్మలంటే నగర ప్రజలు ఇష్టపడుతుంటారు. ఈ కళాకారుడి వద్ద రెండు నెలల ముందుగానే విగ్రహాన్ని బుక్ చేసుకోవాలనే డిమాండ్ ఉంది.

మట్టి విగ్రహాలకు డిమాండ్

భక్తులు మట్టి విగ్రహాలనే కోరుకుంటున్నారు. వీటి తయారీకి చాలా సమయం పడుతుంది. ఇప్పటికే తయారు చేసిన విగ్రహాల్లో 70 నుంచి 80 శాతం ఆర్డర్లు వచ్చాయి. చిన్ననాటి నుంచి విగ్రహాల తయారీలో శిక్షణ పొందాం. పండగ సమయాల్లో కుటుంబాన్ని నెలలు విడిచి వినాయక విగ్రహాలు తయారు చేస్తాం. ముడిసరకుల కొనుగోలుకు అప్పులు చేసి పెట్టాం. మూడు నెలలు ముందుగానే ఒడిశా భద్రక్ నుంచి కళాకారులను తెప్పించి మూడు పూటల భోజనం పెట్టి, వారి కుటుంబాలకు ఎంతో కొంత డబ్బులిచ్చి పంపాలి. తయారు చేసిన బొమ్మలన్నీ విక్రయమవ్వగా వచ్చే ఆదాయంతోనే ఏడాది పొడవునా బతుకుతాం.

– కార్తీక్, కళాకారుడు



పేద మహిళ వైద్యానికి వాసుపల్లి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

దాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ ఆపద్బాంధవుడిగా మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ నిలుస్తున్నారు. 33వ వార్డులో నివసిస్తున్న నారాయణమ్మ అనే మహిళ ఛాతి, దీర్ఘకాలిక వ్యాధులతో కొన్నేళ్లుగా మంచాన పట్టారు. పార్టీ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ద్వారా విషయం తెలుసుకున్న వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం ఆమెను పరామర్శించి సొంత నిధులు రూ.5 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. వైద్యపరంగా ఎటువంటి సహాయం కావాలన్నా తనను సంప్రదించవచ్చని నారాయణమ్మకు భరోసా కల్పించారు. తాను గెలిచినా.. ఓడినా నియోజకవర్గ పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. బడుగు, బలహీన వర్గాలు, మైనారిటీలు, క్రైస్తవులు ఇలా అన్ని మతాలు కలిగిన తమ నియోజకవర్గ ప్రజలతో తనకు విడదీయరాని బంధం ఉందన్నారు. వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటానని వాసుపల్లి హామీనిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పచ్చిరపల్లి రాము, బీసీ సెల్ అధ్యక్షుడు ససపల రవీంద్రభరత్, సూర్యనాయుడు, హేమ, కొల్లు సత్యవతి, శ్రీనివాసరావు, చోడిపల్లి శివకుమార్, చిన్న, హరి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వ్యక్తికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్



ఎన్‌సీడీ స్క్రీనింగ్ టెస్ట్ చేయించుకుంటున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ ప్రతి వ్యక్తి వద్ద ఉండాలని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో ప్రజారోగ్య విభాగం అధికారులు నాన్ కమ్యునికబుల్ డిసీజ్(ఎన్‌సీడీ) స్క్రీనింగ్ పరీక్షలు, ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవీఎంసీ ఉద్యోగులు, పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ హెల్త్ గుర్తింపు కార్డులో వ్యక్తి ఆరోగ్య పరీక్షలు, మందులు మొదలైనవి నిక్షిప్తమై ఉంటాయని, తద్వారా ఆరోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు ఏ ఆస్పత్రికి వెళ్లిన ఈ కార్డు చూపిస్తే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుంటుందన్నారు. పీజీఆర్‌ఎస్‌కు వచ్చిన వారికి ఎన్‌సీడీ స్క్రీనింగ్ టెస్టులు బీపీ, సుగర్ వంటి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. నగరంలోని ప్రతి పౌరుడికి ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీపీవో ఎస్‌హెచ్‌యూఎం శశిభూషణ్, ఏఎన్‌ఎంలు, ప్రజారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుకు వినతి



మేయర్ పీలా శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

దాబాగార్డెన్స్: జగదాంబ జంక్షన్‌లోని మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని రోడ్డు విస్తరించే విషయమై తొలగించారని, తిరిగి ప్రతిష్ఠించాలని పలుమార్లు జీవీఎంసీ కమిషనర్‌కు విన్నవించినా.. స్పందించ లేదని కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌చార్జి కె.వి.సూర్యనారాయణ అన్నారు. ఆయన నేతృత్వంలో పలువురు పార్టీ నాయకులు సోమవారం మేయర్ పీలా శ్రీనివాసరావును పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 20న రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు. మేయర్ స్పందిస్తూ.. జీవీఎంసీ కమిషనర్‌తో మాట్లాడి స్థలం కేటాయించమని చెబుతామన్నారని సూర్యనారాయణ తెలిపారు. పార్టీ రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ జీవీవీఎస్ కమలాకరరావు, దండి ప్రియాంక, కస్తూరి వెంకటరావు, బాషా, దేవా, నూకరాజు, సత్యనారాయణ, అప్పారావు, శ్రీధర్, ప్రసాద్, రజనీకాంత్, గాయత్రి, విజయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం



జోన్–4 కార్యాలయంలో అర్జీ స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు



అర్జీదారుల వినతులు పరిశీలిస్తున్న జోన్–5 కమిషనర్ రాము

జగదాంబ: సూర్యాబాగ్‌లోని జీవీఎంసీ జోన్–4 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పబ్లిక్ హెల్త్ విభాగానికి 2, రెవెన్యూ విభాగానికి 1 చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు, తాగునీటి విభాగం అధికారులు పాల్గొన్నారు.

జోన్–5కు 13 అర్జీలు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగానికి 06, ఇంజినీరింగ్‌కు 05, రెవెన్యూకు 01, పబ్లిక్ హెల్త్‌కు 01 చొప్పున అర్జీలు అందినట్లు తెలిపారు. ప్రజా ఫిర్యాదుల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను జెడ్సీ ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈలు తారా ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, వాటర్ ఏఈ సుమన్, ఏపీడీవో కృపానందం, పి.పుణ్యవతి, జనార్దనరావు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసగించిన చంద్రబాబు



34వ వార్డులో మహిళలకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న తోట పద్మావతి



33వ వార్డులో ప్రచారం చేస్తున్న ముత్తాబత్తుల రమేష్ తదితరులు



35వ వార్డులో ప్రచారం చేస్తున్న కనకరెడ్డి

33, 34, 35 వార్డుల్లో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'

అల్లిపురం: అమలు కాని హామీలిచ్చి అన్ని వర్గాల ప్రజలను ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం చేస్తున్నారని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం ఆమె ఆధ్వర్యంలో వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కొబ్బరితోట ప్రాంతంలో గడప గడపకు వెళ్లి ప్రజలకు బాబు మోసాలను వివరించారు. కార్యక్రమంలో ఎర్నిమాంబ గుడి చైర్మన్ లండ రమణ, టర్నల్ చౌల్ట్రీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు లింగం శ్రీను, 51వ బూత్ కమిటీ సభ్యులు రామలక్ష్మి, రాములమ్మ, జ్యోతి, గాలి పార్వతి, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు అప్పలరాజు, వార్డు మహిళా నాయకులు దానాయమ్మ, సత్యవతి సీనియర్ నాయకులు గోవింద్,అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు వెళ్లి..

వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో వార్డులోని గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో 69, 74 పోలింగ్ బూత్‌ల పార్టీ సీనియర్ నాయకుడు పచ్చిరిపల్లి రాము, వేంకటేశ్వరస్వామి టెంపుల్ మాజీ చైర్మన్ ఆడారి వెంకటమహేష్, సౌత్ కల్చర్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, వార్డు సెక్రటరీ సంతోష్‌కుమార్, మహిళా నాయకులు హేమ, కొల్లు సత్యవతి, లక్ష్మీకాంతం, బాడుగ శ్రీనివాసరావు ధర్మ, పీవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, బూర్ల చిన్న, మత్స్యకార నాయకుడు చోడిపల్లి శివకుమార్, రంజిత్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బాబు మోసాలపై ఇంటింటా ప్రచారం

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు 80వ బూత్ పండా వీధి, స్ప్రింగ్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కనకరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలపై ప్రజలకు వివరించారు. ఆఖరికి సూపర్ సిక్స్ పథకాలను కూడా విస్మరించారన్నారు. ఇటువంటి ప్రభుత్వాన్ని నమ్మి ప్రజలు మోసపోయారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సెక్రటరీ ఆదివిష్ణురెడ్డి, సౌత్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు సువర్ణరాజు, పబ్లిక్ వింగ్ అధ్యక్షుడు జీరు సూర్యానారాయణ, సిటీ వాణిజ్య విభాగం సెక్రటరీ గంగాధర్, నాగిరెడ్డి, శేఖర్, రవికుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణలక్ష్మికి విశేష పూజలు



శ్రావణలక్ష్మి పూజలు చేస్తున్న వేదపండితులు, అర్చకులు, పాల్గొన్న ఉభయదాతలు

దాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రావణ మాస పూజలు 12వ రోజుకు చేరాయి. సోమవారం ఉదయం 8 గంటలకు వేదపండితులు శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించాలని ఆలయ ఈవో కె.శోభారాణి తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఉభయదాతలు, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 వరకు జరిగే ఈ పూజలో పాల్గొనే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు.

ములగాడ-మారుతి సర్కిల్‌లో కొత్త రోడ్డు నిర్మించాలి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 58వ వార్డు ములగాడ నుంచి షీలానగర్ పోర్ట్ రహదారి మారుతీ సర్కిల్ వరకు నూతన సీసీ రోడ్డు నిర్మించి, ఇరువైపులా కాలువలు, ఎల్‌ఈడీ విద్యుత్ దీపాల ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మేయర్ పీలా శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ములగాడ మారుతీ సర్కిల్ మీదుగా మల్కాపురం, గాజువాక ప్రాంతాలకు సంబంధించి వేలాది మంది ప్రజలు వివిధ వాహనాల ద్వారా నగరానికి రోజూ రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఈ రోడ్డు పూర్తిగా శిథిలమై, గోతులమయమైందని, వర్షాలకు నీరు గోతుల్లో నిల్వ ఉండటంతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని చెప్పారు. పోర్ట్ యాజమాన్యం, జీవీఎంసీ కమిషనర్, మేయర్ స్పందించి నూతన రోడ్డు నిర్మాణం తక్షణమే చేపట్టాలని కోరారు. సీపీఎం మల్కాపురం జోన్ కార్యదర్శి పి.పైడిరాజు, ఆర్.లక్ష్మణమూర్తి, కె.పెంటారావు, ఎం.సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ శిక్షణతో భవితకు నిచ్చెన



'బి' సర్టిఫికెట్లతో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లకు సోమవారం 'బి' సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన 19 మందికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల చేతుల మీదుగా సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్‌సీసీ శిక్షణ యువతకు శారీరక, మానసిక స్థైర్యాన్ని పెంపొందించే గొప్ప వేదకని అన్నారు. 'బి' సర్టిఫికెట్ విద్యార్థుల కెరీర్‌కు పునాది వేసే ముఖ్య అడుగని క్యాడెట్లను అభినందించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు సేవా భావం, క్రమశిక్షణ, జాతీయతతో కళాశాల గౌరవాన్ని పెంచాలని కాలేజీ ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ కె.గీతాంజలి ఆకాంక్షించారు. కార్యక్రమంలో డి.అరుణపద్మ, డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎల్.శరణ్య, క్యాడెట్లు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో మహిళల భద్రతకు చర్యలు

వాల్తేర్ డివిజన్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం

తాటిచెట్లపాలెం: పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులకు భద్రతతో కూడిన గౌరవప్రదమైన వాతావరణం కల్పించేందుకు వాల్తేర్ డివిజన్ సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం ప్రారంభించింది. డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా, సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ జూసుఫ్ కబీర్ అన్సారీల నేతృత్వంలో ఈ బృందం సిబ్బందిపై లైంగిక వేధింపులు, హక్కులు, విధుల గురించి అవగాహన కల్పిస్తారు. ప్రతి ఉద్యోగికి ప్రత్యేకంగా మహిళా ఉద్యోగులకు ఎటువంటి భయం, ఆందోళన లేకుండా చేయడమే వాల్తేర్ డివిజన్ లక్ష్యమని డీఆర్‌ఎం లలిత్ బోహ్రా ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నాలుగు నిబద్ధత గల కమిటీలు ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఇవి డివిజన్ పరిధిలోని ఆయా రైల్వే స్టేషన్లు, పనిచేసే ప్రదేశాల్లో పర్యటించి మహిళా ఉద్యోగులకు వారి విధుల్లో ఎదురయ్యే లైంగిక వేధింపులపై పలు కీలక సూత్రాలను తెలియజేస్తారన్నారు. ఈ బృంద సభ్యులు మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతూ వేధింపుల సమయంలో ఎలా ఎదుర్కోవాలో వివరిస్తారని చెప్పారు. అవగాహన కార్యక్రమాలు, సెమినార్లు, ముఖాముఖి కార్యక్రమాలు వంటివి అన్ని విభాగాల్లోనూ నిర్వహిస్తారని పేర్కొన్నారు. బాధితుల పక్షాన నిలబడి, ఫిర్యాదుల నమోదులో వారికి అవసరమైన సహాయం చేస్తారని తెలిపారు. పలు రైల్వే స్టేషన్లలో రైల్వే మహిళా గ్యాంగ్‌కు టీం సభ్యులు అవగాహన కల్పించారు.